# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

సోమవారం 08 ఏప్రిల్ 2024

సంపుటి.01 సంచిక.248





## ఫోన్ ట్యాపింగ్ పై జూపల్లి వ్యాఖ్యలు చూస్తుంటే నిజంగా నవ్వొస్తోంది

తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్

మంత్రుల ప్రెస్ మీట్ పై ప్రవీణ్ కుమార్ స్పందన

జూపల్లికి ట్యాపింగ్ పై కనీస అవగాహన లేదని విమర్శలు

కామెడీలు ఇకనైనా ఆపండి అంటూ

# గ్యారంటీలపై విస్తృత ప్రచారం



**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ గ్యారంటీ హామీలు అమలు చేస్తున్న సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు.**

**జాతీయ మ్యానిఫెస్టో అంశాలూ ప్రజలకు చెప్పండి**

**పార్టీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం**

**సికింద్రాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాలపై సమీక్ష**

హైదరాబాద్, రంగంపేట-న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ గ్యారంటీ హామీలు అమలు చేస్తున్న సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మిగిలిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ జాతీయ మ్యానిఫెస్టోలో ఇచ్చిన గ్యారంటీ హామీలపైనా ఇంటింటికీ విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. సీఎం ఆదివారం తన నివాసంలో సికింద్రాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో వేర్వేరుగా సమీక్షలు జరిపారు. నాయకులందరూ కలిసికట్టుగా పనిచేస్తే లోక్‌సభ ఎన్నికల్లో విజయం సునాయాసమేనని ధీమా వ్యక్తం చేశారు. భారాసకు ప్రజల్లో బలం లేదని.. ఆ పార్టీకి ఓటు వేస్తే వృథాయే అన్న నినాదంతో ముందుకెళ్లాలని చెప్పారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో చురుగ్గా పనిచేసే పార్టీ కార్యకర్తలను గుర్తించాలని, వారితో ఇంటింటి ప్రచారం చేయించాలని సూచించారు. ఇతర పార్టీల నుంచి చేరికలు, సామాజికవర్గాల వారీగా ఓటర్ల వివరాలను ఆయన ఆరా తీశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీల కన్నా రెట్టింపు ఆధిక్యంతో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేలా కృషి చేయాలన్నారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి మండల, అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గ స్థాయి వరకూ పార్టీ ప్రచార కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**కిషన్‌రెడ్డిపై వ్యతిరేకతను సానుకూలంగా మలచుకోవాలి..**

కిషన్‌రెడ్డి.. తాను సిటింగ్ ఎంపీగా ఉన్న సికింద్రాబాద్ నియోజకవర్గానికి గాని, రాష్ట్రానికి గాని ప్రత్యేకంగా చేసిందేమీ లేదని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని రేవంత్‌రెడ్డి సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కిషన్‌రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, దాన్ని సానుకూలంగా మలచుకునేలా పెద్దఎత్తున ప్రచారం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు నేతలు చెప్పారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున విజయారెడ్డి, భారాస తరఫున దానం నాగేందర్ పోటీపడగా.. దానం నెగ్గిన విషయం తెలిసిందే. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌ను కాంగ్రెస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలిపింది. ఇరువురు నేతలూ సమష్టిగా పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని సీఎం సూచించారు.

**అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీల కన్నా రెట్టింపు రావాలి..**

వరంగల్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి సూచించారు. ఆమె గెలుపు బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన చెప్పినట్లు తెలిసింది. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కాంగ్రెస్, ఇతర పార్టీల పరిస్థితులపై రేవంత్ సమీక్షించారు. 'వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల విస్తృతస్థాయి సమావేశాలు వెంటనే నిర్వహించాలి. తర్వాత మండలస్థాయి ప్రచార కమిటీల సమావేశాలు పెట్టాలి. ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి నేతలతో కలసి సమన్వయంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి' అని రేవంత్‌రెడ్డి సూచించారు. వరంగల్ ఎంపీ టికెట్ కోసం పోటీపడిన దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్ తదితరులను సమావేశానికి సీఎం పిలిపించి మాట్లాడారు. టికెట్ రాలేదని నిరుత్సాహపడవద్దని.. భవిష్యత్తులో పార్టీలో, ప్రభుత్వంలో మంచి అవకాశాలు కల్పిస్తామని, లోక్‌సభ ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు. వరంగల్ నియోజకవర్గ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి (పరకాల), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), నాయిని రాజేందర్‌రెడ్డి (వరంగల్ పశ్చిమ), యశస్వినిరెడ్డి (పాలకుర్తి), గండ్ర సత్యనారాయణ (భూపాలపల్లి), కేఆర్ నాగరాజు (వర్ధన్నపేట), ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర ముఖ్యనేతలు, సికింద్రాబాద్ నియోజకవర్గ సమావేశంలో అభ్యర్థి దానం నాగేందర్, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, నేతలు అజారుద్దీన్, రోహిన్‌రెడ్డి, విజయారెడ్డి, ఫిరోజ్‌ఖాన్, కోట నీలిమ తదితరులు పాల్గొన్నారు. సమావేశాలకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హాజరయ్యారు.

## మా కార్యకర్తలు

### పోటెత్తే కెరటాలు.. పోరాడే సైనికులు

**తుక్కుగూడలో శనివారం నిర్వహించిన జనజాతర సభకు వచ్చిన స్పందనపై సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించారు.**

**హైదరాబాద్:** తుక్కుగూడలో శనివారం నిర్వహించిన జనజాతర సభకు వచ్చిన స్పందనపై సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించారు. "కాంగ్రెస్ ఓ మహా సముద్రం.. అందులో మా కార్యకర్తలు నీటి బిందువులు కాదు.. పేదల బంధువులు. మా కార్యకర్తలు పోటెత్తే కెరటాలు, పోరాడే సైనికులు. వాళ్లు త్యాగశీలురు, తెగించి కొట్లాడే వీరులు. జెండా మోసే బోయీలు మాత్రమే కాదు.. అజెండాలు నిర్ణయించే నాయకులు. నిన్నటి తుక్కుగూడ గడ్డపై పోటెత్తిన కాంగ్రెస్ మహా సముద్రపు కెరటాలు చెప్పిన నిజమిది.. చేసిన శబ్దమిది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.



## మెట్రో ప్రయాణికులకు బిగ్ షాక్!

హైదరాబాద్: హైదరాబాద్‌లో మెట్రో ప్రయాణికులకు బిగ్ షాక్ తగిలింది. ఇప్పటి వరకు మెట్రో కార్డుపై ఉన్న రాయితీని, హాలీడే కార్డును మెట్రో అధికారులు పూర్తిగా రద్దు చేశారు. దీంతో, ప్రయాణికులపై అదనంగా భారం పడనుంది.

కాగా, హైదరాబాద్‌వాసులకు మెట్రో రైలు ప్రధాన రవాణా సాధనంగా మారింది. ఎలాంటి ట్రాఫిక్ చిక్కులు లేకుండా తక్కువ సమయంలో ప్రజలు, ఉద్యోగులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దీంతో, ఉదయం, సాయంత్రం వేళల్లో, సెలవు రోజుల్లో మెట్రో ప్రయాణంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇక గత కొన్ని రోజులుగా ఎండలు దంచికొడుతుండటంతో ప్రజలు మెట్రో బాటపట్టారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు అధికారులు షాకిచ్చారు.



## బీఆర్ఎస్ కు షాకిచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే

**ఖమ్మం:** భారత రాష్ట్ర సమితికి మరో షాక్ తగిలింది. ఖమ్మం సెగ్మెంట్లో ఆ పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన ఒకే ఒక అభ్యర్థి, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పార్టీ మారారు. ఆదివారం బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్పిన తెల్లం వెంకట్రావు.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కండువా కప్పి తెల్లం వెంకట్రావును కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. వెంకట్రావుతోపాటు ఆయన సహచరులు కూడా హస్తం పార్టీలో చేరారు. దీంతో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యే సెగ్మెంట్లలో కారు ఖాళీ అయ్యింది. తెల్లం వెంకట్రావు పార్టీ మారతారని కొద్ది రోజులుగా ప్రచారం జరిగింది. బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు కొంతకాలంగా వెంకట్రావు దూరంగా ఉన్నారు.

# అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో గారడీ



**జనజాతర కాదది హామీల పాతర.. కాంగ్రెస్ సభపై కేటీఆర్ విమర్శ**

**పార్లమెంట్ ఎన్నికలకు న్యాయ్ పేరుతో నాటకాలు**

**4 కోట్ల తెలంగాణ ప్రజలను 4 నెలలుగా నయవంచన**

**కాంగ్రెస్ పార్టీపై కవితాత్మకంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి కేటీఆర్**

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతో గారడీ చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు న్యాయ్ పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహించిన సభపై విమర్శల వర్షం కురిపించారు. జనజాతర కాదది ప్రజలకు ఇచ్చిన హామీల పాతర, అబద్ధాల జాతర సభ అంటూ మండిపడ్డారు. రాహుల్ గాంధీ జీ.. తెలంగాణకు తీరని అన్యాయం చేసిన మీరు ఇప్పుడొచ్చి న్యాయ్ అంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. అబద్ధపు హామీలను నమ్మి ఓటేసిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలలుగా నయవంచనకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. అసత్యాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్నదాతలను ఆత్మహత్యలకు, నేతన్నల బలవన్మరణాలకు కారణమవుతోందని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక నరకం చూపిస్తున్నారని కేటీఆర్ ఫైర్ అయ్యారు. అసమర్థ పాలన వల్ల సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రుణమాఫీ చేయకపోవడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం గోస పడుతున్న జనం మీ మోసాలపై మండిపడుతున్నారు అని రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. తెలంగాణ రైతుల ఆర్తనాదాలు వినిపించడం లేదా అంటూ నిలదీశారు. చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయినా కనికరించరా? రుణమాఫీపై సర్కారును నిలదీయరా అంటూ ప్రశ్నించారు. సకల రంగాలను సంక్షోభంలోకి నెట్టిన భస్మాసుర హస్తాన్ని నెత్తిన పెట్టుకుంటే.. నిండా మునగడం ఖాయమని తేలిపోయిందన్నారు. అందుకే.. వందరోజుల్లోనే హామీలను బొందపెట్టిన కాంగ్రెస్ కు వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు గుణపాఠం చెబుతారని కేటీఆర్ చెప్పారు. జై తెలంగాణ అంటూ తన ట్వీట్ ను ముగించారు.

# పద్మశాలీల అభ్యున్నతికి కృషి .

**ఎంపీ. అరవింద్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే లు దన్ పాల్, ప్రశాంత్ రెడ్డి, భూపతి రెడ్డి. ఘనంగా జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 7:**



పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎంపీ దర్మపురి అర్వింద్ అన్నారు. తాను ఎంపిగా గెలవడంలో పద్మశాలీలది కీలకపాత్ర అని ఆయన గుర్తు చేశారు. ఆదివారం నిజామాబాదు నగరంలోని బస్వా గార్డెన్స్ లో నిజామాబాదు జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపి అర్వింద్ ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
నిజామాబాదు కార్పోరేషన్ లో కూడా పద్మశాలీల తోడ్పాటుతో 28 కార్పోరేటర్ స్థానాల్లో బిజెపి విజయం సాదించిందని పేర్కొన్నారు. మొన్నటి ఎన్నికల్లో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన బోగ శ్రావణికి జగిత్యాల్ లో బిజెపి అసెంబ్లీ టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. పద్మశాలి అయిన కొండ లక్ష్మణ్ బాపూజీ
ముఖ్యమంత్రి ఎందుకు కాలేదో పద్మశాలీలు ఆలోచించుకోవాలని పరోక్షంగా కాంగ్రెస్ ను విమర్శిస్తూ అర్వింద్ పేర్కొన్నారు. జిల్లాలో పద్మశాలీల అభివృద్ధి కోసం రెండు కోట్ల రూపాయల వరకు నిధులు ఎంపి ఫండ్ నుంచి ఇచ్చానని చెప్పారు. విశ్వకర్మ రుణాలు ముద్ర రుణాలు అత్యధికంగా నిజామాబాదు పార్లమెంటు స్థానానికి వచ్చాయని ఆయన గుర్తు చేశారు. నిజామాబాదు పార్లమెంటు పరిదిలో వేల కోట్లతో హైవేలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టానని అర్వింద్ పేర్కొన్నారు.
రామరాజ్య స్థాపన కోసం అందరం కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. నిజామాబాదు అర్బన్ శాసనసభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పద్మశాలి కార్పోరేషన్ కు ఆరు నెలల్లోనే వెయ్యి కోట్ల నిధులివ్వాలని లేనిపక్షంలోబిజెపి ఎమ్మెల్యేలమంతా కలిసి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. నిజామాబాదు రూరల్ శాసనసభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ, పద్మశాలి సంఘ భవనం కోసం రెండెకరాల భూమి కేటాయింపజేస్తామని, పద్మశాలీలు రాజకీయంగా ఎదిగేలా కృషి చేస్తామన్నారు. మాజీమంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, పద్మశాలీలకు అండగా ఉంటామని వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని అన్నారు.

**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ,**

స్వాతంత్ర్య పోరాటంలో పద్మశాలీల పాత్ర మరవరానిదని .కొండా లక్ష్మణ్ బాపూజీ తదితర పద్మశాలీ నేతలు స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మినరల్ డెవలప్‌మెంట్ చైర్మెన్ ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా పద్మశాలి
సంఘం గౌరవాధ్యక్షులు దీకొండ యాదగిరి, అద్యక్షులు బిజ్జు దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి అవదూత దశరథం, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, పద్మశాలి సంఘం నాయకులు గోస్కె యాదగిరి, బూర మల్లేశం, రాపెల్లి గురుచరణం, గుజ్జేటి వెంకటనర్సయ్య, రాపోలు సుధాకర్, చింతల గంగాదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ పై జూపల్లి వ్యాఖ్యలు చూస్తుంటే నిజంగా నవ్వొస్తోంది: ప్రవీణ్ కుమార్



హైదరాబాద్:తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ అంశం తాలూకు ప్రకంపనలు ఇంకా కొనసాగుతున్నాయి. తాజాగా, ఫోన్ ట్యాపింగ్ అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మంత్రి జూపల్లి వ్యాఖ్యలు హాస్యాస్పదం అంటూ కొట్టిపారేశారు. ఫోన్ ట్యాపింగ్ పై మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలు చూస్తే నిజంగానే నవ్వొస్తోందని తెలిపారు. ఈ మేరకు ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు.
"ఇద్దరు వ్యక్తులకు మధ్య జరిగే ఫోన్ సంభాషణను వాళ్లకు తెలియకుండా మూడో వ్యక్తి లేదా సంస్థ విని రికార్డు చేస్తే దాన్ని ఫోన్ ట్యాపింగ్ అంటారు మంత్రి గారూ. మీకు ఫోన్ ట్యాపింగ్ గురించి కనీసం ప్రాథమిక అవగాహన కూడా ఉన్నట్టు లేదు. అసలు మీకు తెలియకుండా మీ ఫోన్ నుంచి పొంగులేటి గారికి కాల్ ఎలా పోతుంది? పొంగులేటి గారి ఇన్ కమింగ్ లిస్టులో ఉన్నది మీ పేరేనా? మీ స్పీడ్/ఎమర్జెనీ కాల్ లిస్టులో పొంగులేటి గారి నెంబర్ ఉందేమో? అసలు... మీ ఫోన్ ఎప్పుడూ మీ వద్దే ఉంటుందా? మీ ఫోన్ కు పాస్ కోడ్ ఉందా? పొరపాటున మీరు ఫేస్ టైమ్ నొక్కారేమో? రాత్రి అన్నారు కాబట్టి... నిద్రమత్తులో పొంగులేటి గారికి నొక్కారేమో? ఒకవేళ మత్తులో ఉంటే మీకు తెలిసే అవకాశమే లేదు. మీకు తెలియని వ్యక్తి మీకు కాల్ చేయడం ఏంటి... మీరు గట్టిగా అరవడం ఏంటి? దీనికి ట్యాపింగ్ కు సంబంధం ఏంటి? మీ ఫిర్యాదు చూసి డీజీపీ కూడా కడుపుబ్బా నవ్వుకుని ఉంటాడు. ఆ కంప్లెయింట్ మాతో కూడా పంచుకోండి... ప్లీజ్" అంటూ ప్రవీణ్ కుమార్ వ్యంగ్యం ప్రదర్శించారు.
"ఎందుకు సార్... సీనియర్ మంత్రి అయిన మీరు పైనుంచి వచ్చిన స్క్రిప్టును గుడ్డిగా చదివి అభాసుపాలవుతారు? ఈ ప్రపంచంలో ట్యాపింగ్ కు, హ్యాకింగ్ కు అతీతమైన టెక్నాలజీ ఏదీ లేదు. స్మార్ట్ ఫోన్ కొన్నాక %×చాస్త్రతీవవ% అనే బటన్ నొక్కిన రోజే మన వ్యక్తిగత గోప్యత అనేది ఆవిరైపోతుంది... ఒకవేళ మీకు సమయం ఉంటే నెట్ ఫ్లిక్స్ లో ఎడ్వర్డ్ స్నోడెన్ ఎపిసోడ్ లు చూడండి. దయచేసి ఈ ట్యాపింగ్ కామెడీని మీ అందరూ ఇక ఆపేసి, కేసీఆర్ లాగా రైతన్నల వద్దకు వెళ్లండి. వారి కన్నీళ్లను తుడవండి... పోయిన పరువు కొంచెమన్నా దక్కుతుంది. తెలంగాణ ప్రజానీకం దృష్టి మరల్చేందుకు ప్రయత్నించకండి... ఇప్పటికే వాళ్లు ఆవేశంతో రగిలిపోతున్నారు" అంటూ ప్రవీణ్ కుమార్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# ప్రజా పాత్రికేయాన్ని కాపాడుకుందాం



పత్రికా స్వేచ్ఛ వదలరాని విలువైన ప్రత్యేక హక్కు అని గాంధీ అన్నారు. పత్రికా రంగం ప్రజాస్వామ్య నాల్గవ స్తంభం. మానవత్వ విలువల, సామాజిక బాధ్యతల, నైతిక పాత్రికేయత సమాజ నిర్మాణానికే మూలం. భారత జాతీయోద్యమంలో, స్వాతంత్ర్య సమరంలో, స్వేచ్ఛా సాధనలో, జాతీయ భావాల ప్రచారంలో, ఉద్యమాల నిర్మాణంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజా సమీకరణ, ఐక్యతలలో, బలమైన ప్రజాభిప్రాయ నిర్మాణంలో పత్రికా రంగం కీలకంగా కృషి చేసింది. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో, బ్రిటిష్ రాణి ప్రత్యక్ష ఏలుబడిలో బ్రిటిష్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛపై అనేక పరిమితులు విధించింది. లండన్ నుండి ప్రచురించే పత్రికలు భారత స్వాతంత్ర్య పోరాట ఘటనలను వక్రీకరించాయి. స్వాతంత్ర్యం తర్వాత భారత రాజ్యాంగ అధికరణ 19, దాని ఉపాధికరణలు వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛలను అందించాయి. జాతీయోద్యమంలో పాత్రికేయ కట్టడితో బాధలు పడిన భారత తొలి పాలకులు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించ లేదు.
ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పత్రికా స్వేచ్ఛను ప్రోత్సహించినట్లు, తనపై శంకర్స్ వీక్లీ విమర్శలను ఆహ్వానించినట్లు చరిత్ర చెపుతోంది. ప్రభుత్వ విధానాల విమర్శ వ్యక్తి విమర్శ కాదని, దిద్దుబాట్లకు అవకాశమిస్తుందని, దేశ నిర్మాణంలో అది అవసరమని నెహ్రూ ఉద్దేశం కావచ్చు. ఆర్ఎస్ఎస్ మతవాదయితే తానూ మతవాదినేనని వితండీకరించిన సోషలిస్టు జయప్రకాశ్ నారాయణ్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైన్యాన్ని, పోలీసులను, ప్రజలను ఒక బహిరంగ సభలో రెచ్చగొట్టారు. రాజ్యాంగ అధికరణ 352(2) ప్రకారం ఇందిర ఆత్యయిక స్థితిని రుద్దారు. 25 జూన్ 1975 నుండి 21 మార్చి 1977 వరకు 21 నెలల పాటు సాగిన అత్యవసర స్థితి కాలంలో పత్రికా స్వేచ్ఛ హరించబడింది. పాత్రికేయులను జైళ్ళలో పెట్టారు. కాని సమాజాన్ని మతపరంగా చీల్చలేదు. వైదికవాదులను ముస్లిం, క్రైస్తవులపై ఉసిగొల్పలేదు. ఆధిపత్య వర్ణాధికారంతో అల్పసంఖ్యాకులను పరాయీకరించలేదు.
ప్రపంచీకరణలో ఉత్పత్తి రంగాలు, జాతి సంపదలతో పాటు సేవలనూ ప్రైవేటీకరించారు. ఈ నేపథ్యంలో పాత్రికేయ విధానంపై పరిమితులు ప్రారంభమయ్యాయి.
వార్తా ప్రసారం ప్రభుత్వాధికారంగా మారింది. వార్తా ప్రసార వ్యవస్థలు అందులో ప్రవేశించరాదన్న భావం నిర్మించబడింది. అయినా నాటి ప్రభుత్వాలు క్రమం తప్పకుండా పత్రికా సమావేశాలను నిర్వహించేవి. నేటి పాలకులు అధికరణ 19ని తుంగలో తొక్కారు. పత్రికా సమావేశాల ఊసే లేదు. సంఘీయులు పాత్రికేయులను విదేశాల్లో కూడా అవమానించారు, దాడులు చేశారు. నిజాలను బయటపెట్టి, నిర్మొహమాటంగా ప్రశ్నించిన, దేశభక్త, సత్యశోధక, ప్రజాపాత్రికేయులు, నిర్వాహకులను పాలకులు నేర పరిశోధన సంస్థల దాడులకు గురి చేస్తున్నారు. తమను సమర్థించని పాత్రికేయుల కంప్యూటర్లను విచ్ఛిన్నం చేశారు. వాటిలో తప్పుడు సమాచారాలను ఎక్కించారు. దొంగ సాకులతో ప్రాథమిక సమాచార నివేదిక, విచారణలు లేని, బెయిలు అవకాశం లేని చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిరోధక చట్టం (ఉపా) కింద వారిని నిర్బంధిస్తున్నారు. జైళ్ళలో కుక్కుతున్నారు. టెలిగ్రాఫ్ ఆంగ్ల దినపత్రిక సంపాదకుడు ఆర్. రాజగోపాల్, అంతర్జాల పత్రికలు వైర్ సంపాదకులు సిద్ధార్థ వరదరాజన్, న్యూస్ క్లిక్ సంపాదకులు ప్రబీర్ పురకాయస్థ, నిర్వాహకులు ముకేశ్ చక్రవర్తి మొదలగు వారు ఈ జాబితాలో ఉన్నారు. అస్మత్ పాత్రికేయులకు అనుచిత ప్రయోజనాలు కల్పిస్తున్నారు. రిపబ్లికన్ టివి సంపాదకులు ఆర్ణబ్ రంజన్ గోస్వామి వీరిలో ప్రముఖులు. న్యాయస్థానాలు కూడా పాత్రికేయుల ప్రభుత్వ అనుబంధాన్ని బట్టి బెయిల్ నిర్ణయం తీసుకుంటున్నాయి. ఆర్ణబ్ గోస్వామి బెయిల్ కోసం ఒకేసారి కింది కోర్టు నుండి సుప్రీంకోర్టు దాకా అభ్యర్థనలు దాఖలు చేసినా న్యాయమూర్తులు అభ్యంతర పెట్టలేదు. పాత్రికేయులకు న్యాయం చేయడం న్యాయస్థానాల బాధ్యతన్నారు. బెయిల్ ఇచ్చి, ఆ తీర్పు ప్రతి అందినంత వరకు ఆగవద్దని, అంతర్జాల ప్రతి పైనే చర్య తీసుకొమ్మని ఆదేశించారు. ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో 19 ఏళ్ల దళిత బాలిక అగ్రవర్ణ సామూహిక అత్యాచార హత్యకు గురయ్యారు. ఆ సమాచార సేకరణకు వెళుతున్న కేరళ వాసి, ఢిల్లీ పాత్రికేయుడు సిద్ధిక్ కప్పన్‌ను ఉపా చట్టం కింద అక్టోబర్, 2020 లో అరెస్టు చేసి మథుర జైళ్ళో పెట్టారు. జైల్లో ఆయనకు కోవిడ్ సోకినా బెయిల్ ఇవ్వలేదు. రెండేళ్ళ తర్వాత బెయిల్ ఇచ్చినా మరొక కేసులో జైల్లోనే ఉంచారు. 23 డిసెంబర్ 2022 న అలహాబాద్ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఇద్దరు స్థానికుల రూ. లక్ష హామీ షరతు విధించింది. కేరళీయ, ఢిల్లీ పాత్రికేయునికి స్థానిక నగదు పూచీకత్తు సాధ్యమా? ఈ రోజు 72% పత్రికలు, టివిలు న్యూస్- 18 పేరుతో ముకేశ్ అంబానీ వే. పత్రికా రంగంలో సంచలన మార్పులు తెచ్చిన రామోజీ రావు దిన పత్రికలు, టివిలు (ఈనాడు తెలుగు దినపత్రిక, ఈటివి తెలుగు తప్ప) ముకేశ్ అంబానీ సొంతం. కోల్‌కత పాత్రికేయురాలు రాధిక రాయ్, ఆమె భర్త ఆర్థిక నిపుణులు ప్రణయ్ రాయ్ 1984లో 24 గంటల ప్రసార స్వతంత్ర్య న్యూ ఢిల్లీ టివి (ఎన్‌డిటివి) ని స్థాపించారు.

# సూర్యకాంతం పాత్రలు సజీవ శిల్పాలు

గయ్యాళి పాత్రలు అనగానే తెలుగు ప్రేక్షకులకు ఠక్కున గుర్తుకువచ్చే పేరు సూర్యకాంతం. ఓర చూపులు చూస్తూ, ఎడంచెయ్యి విసుర్తూ కుడిచెయ్యి నడుం మీద నిలబెట్టి ఆమె చెప్పిన సంభాషణా చాతుర్యం, అంతలోనే వెక్కిరిస్తూ, అంతలోనే కల్లబొల్లి కబుర్లతో, వెక్కి వెక్కి వెక్కి ఏడుస్తూ వెండి తెరపై విభిన్న పాత్రల కు జీవం పొందింది ఎవరూ అంటే అది పాటతరం సహజ నటి సూర్యకాంతం అని వేరే చెప్పనక్కర లేదు. సూర్యకాంతాన్ని హాస్య నటీమణిగా ముద్ర వెయ్యడానికి లేదు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చెయ్యక పోయినా ఆమె సంభాషణ చెప్పే తీరు, నవ్వు తెప్పిస్తుంది, చేసే చేష్టలు కోపం తెప్పిస్తాయి. అలా అని ఆమె దుష్టపాత్రధారిణి అని కూడా అనలేం. సహాయ నటి అనే అనాలి. తెలుగు సినిమాల్లో గయ్యాళి పాత్రల్లో తన సహజ నటనతో ఆమె ప్రాచుర్యం పొందింది. గయ్యాళి అత్తకి మారుపేరు సూర్యకాంతం అనిపించుకుంది. ఆమె ధరించిన అత్త పాత్రలు సజీవ శిల్పాలు. సహజ నట కళా శిరోమణి, హాస్య నట శిరోమణి, బహుముఖ నటనా ప్రవీణా, రంగస్థల శిరోమణి సూర్యకాంతం తూర్పు గోదావరి జిల్లా కాకినాడ దగ్గరున్న వెంకట కృష్ణరాయ పురంలో 1924 అక్టోబర్ 28న తన తల్లితండ్రులకు 14వ సంతానంగా జన్మించింది. ఆరేళ్ళ చిన్న వయసు లోనే పాడటం, నాట్యమాడటం నేర్చుకొంది. పెరిగే వయసులో హిందీ సినిమా పోస్టర్లు బాగా ఆకర్షించాయి.
సినిమాల్లో నటించాలనే కోరిక ఆపుకోలేక చెన్నై చేరుకొంది. మొదట జెమిని స్టూడియో నిర్మించిన చంద్రలేఖ సినిమాలో డాన్సర్ గా అవకాశం వచ్చింది. అప్పట్లో నెలకు 65 రూ. జీతం ఇవ్వబోతే నిర్మాతతో తన అసంతృప్తిని తెలియ బరచిన మీదట 75 రూపాయలు చేశారు. తరువాత ధర్మాంగద (1949)లో ఆమెది మూగవేషం. ధర్మాంగద టైములో చిన్నా చితకా వేషాలు వేసినా తరువాత లీలా కుమారి సాయంతో మొదటిసారిగా నారద నారది సినిమాలో సహాయ నటిగా అవకాశం వచ్చింది. చిన్న చిన్న పాత్రలు నచ్చక జెమినీ స్టూడియో నుంచి బయటకు వచ్చేసింది. మనసులో బొంబాయికి వెళదామని ఉన్నా అందుకు ఆర్థిక స్తోమత సరిపోక ఆ ఆలోచనను విరమించుకొంది. ఆ పరిస్థితిలో సహాయ నటిగా గృహప్రవేశం సినిమాలో మంచి అవకాశం వచ్చింది. తరువాత తన కల అయిన హీరోయిన్ వేషం సౌదామిని చిత్రం ద్వారా వచ్చింది. కానీ ఆ సమయంలో కారు ప్రమాదం జరిగి ముఖానికి గాయం అవడంతో ఆ అవకాశం తప్పి పోయింది. బాగైన తరువాత సంసారం చిత్రంలో మొట్టమొదటి సారిగా గయ్యాళి అత్త పాత్ర వచ్చింది. తరువాత తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా తెలుగు సినీ అభిమానుల గుండెల్లో నిలిపోయేలా జీవితాంతం అవే పాత్రలలో నటించింది. అసలు సంసారం చిత్రం తరువాత బొంబాయికి చెందిన ఒక నిర్మాత ద్వారా హీరోయిన్ గా అవకాశం వచ్చింది.
కానీ తనకు అవకాశం రాక ముందే ఇంకొక హీరోయిన్ ను పెట్టుకొని తీశేసారని తెలియడంతో, "ఒకరి బాధను నా సంతోషంగా తీసుకోలేను" అని ఆ సినిమాను నిరాకరించింది. కోడరికం సినిమా ఆమెకు ఎంతో పేరు తీసుకొచ్చింది. బి.నాగిరెడ్డి, చక్రపాణిలు ఆమె లేకుండా సినిమాలు తీసేవారు కారు. హైకోర్టు జడ్జి పెద్దిబొట్ల చలపతిరావు ను 1950లో వివాహ మాడారు. ఆ రోజుల్లోని అనేక సాంఘిక చిత్రాల్లో రేలంగి - సూర్యకాంతం, రమణారెడ్డి - సూర్యకాంతం, ఎస్.వి.రంగారావు - సూర్యకాంతం- జంటలు, వాళ్ల దృశ్యాలు గుర్తుకు తెచ్చుకుని ఇవాళ కూడా హాయిగా నవ్వుకోవడం కద్దు. కొత్త సినిమా వస్తూంటే అందులో సూర్యకాంతం వుందా? అని ప్రేక్షకులూ, తారా గణంలో సూర్యకాంతం వున్నట్టేగదా? అని సినిమా డిస్ట్రిబ్యూటర్లూ - ఎదురు చూసేవారు. చక్రపాణి (1954), దొంగరాముడు (1955), చిరంజీవులు (1956), తోడికోడళ్లు (1957), అత్తా ఒకింటి కోడలే (1958), ఇల్లరికం (1959), భార్యాభర్తలు (1961), గుండమ్మ కథ (1962), కులగోత్రాలు (1962), దాగుడు మూతలు (1964), అత్తగారు–కొత్తకోడలు, మూహూర్తబలం (1969) లాంటి మరపురాని ఎన్నో సినిమాలలో నటించింది. నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఒకసారి టెలివిజన్ ఇంటర్వ్యూలో..."నువ్వు తెలుగు భాషకు చేసిన అన్యాయం ఒకటుంది. 'సూర్యకాంతం' అనే చక్కని పేరు ఇంకెవరూ పెట్టుకోకుండా చేశావు" అని ఆమెతో చమత్కారంగా అన్నానని చెప్పాడు. వ్యక్తిగా సూర్యకాంతం గయ్యాళి కానేకాదు - మామూలు మనిషే. ఏ సమావేశాలకో, సినిమా ఉత్సవాలకో ఆమె వెళ్లినప్పుడు ఆటోగ్రాఫుల కోసం వెళ్లే స్త్రీలు సూర్యకాంతం దగ్గరకి వెళ్లడానికి భయపడేవారు. ఐతే ఆమె నికార్సయిన మనిషి, కచ్చితమైన మనిషి, సహృదయం గల మనిషి, సహాయపడే మనిషి. ఆమె శుభ్రంగా కడుపునిండా తినేది, పదిమందికీ పెట్టేది. షూటింగ్‌కి వచ్చినప్పుడల్లా - తనతో ఏవో తినుబండారాలు తీసుకు రావడం, అందరికీ పెట్టడం అలవాటు. ఇలాంటి అలవాటు సావిత్రి, కృష్ణకుమారి, జానకి వంటి నటీ మణులకీ వుండేది. షూటింగుల్లో జోకులు చెప్పడం, సూర్యకాంతం సరదాల్లో ఒకటి. ఓ సినిమాలో నాగయ్యను నానా మాటలూ అని, నోటి కొచ్చిన తిట్లు తిట్టాలి. షాట్ అయిపోయాక ఆయన కాళ్లమీద పడి 'అపరాధం - క్షమించండి!' అని వేడుకుంది. 'పాత్ర తిట్టిందమ్మా, నువ్వెందుకు బాధపడతావూ? లే!-' అని నాగయ్య లేవనెత్తితే, కన్నీళ్లు తుడుచుకున్న భక్తీ, సెంటిమెంటూ ఆమెవి. దబాయింపూ, కచ్చితత్వమూ ఉన్న మనిషే అయినా, మనసు మాత్రం వెన్న, సున్నితం. అవసరమైన వాళ్లకి ఆర్థిక సహాయం చేసేదిగాని అనవసరం అనిపిస్తే మాత్రం 'పూచికపుల్ల' కూడా విదిలించేది కాదు.

# ఏకంగా 174 శాతం ప్రీమియంతో ఎంట్రీ!



స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే వారు ముఖ్యంగా ఐపీఓల కోసం ఎదురుచూస్తుంటారు. ఇవి లిస్టింగ్‌తోనే బంపర్ రిటర్న్స్ ఇస్తుంటాయి. గతేడాది ఆఖర్లో స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లిన నేపథ్యంలో.. పలు ఐపీఓలు ఇన్వెస్టర్లకు మంచి లాభాలు అందించాయని చెప్పొచ్చు. ఇప్పుడు చాలా రోజుల తర్వాత ఒక ఐపీఓ భారీ లాభాలు నమోదు చేసింది. లిస్టింగ్‌తోనే 174 శాతం ప్రీమియం నమోదు చేసి.. మళ్లీ అప్పర్ సర్క్యూట్ కొట్టింది.
మీరు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారా? మరి సరైన స్టాక్స్ ఎంచుకుంటున్నారా? ఇంకా ఆర్థిక నిపుణుల సలహా కూడా తీసుకోవాలి. మార్కెట్లను జాగ్రత్తగా గమనిస్తూ ఒక పద్ధతిలో పెట్టుబడులు పెడుతుండాలి. ఇలా దీర్ఘకాలంలో చాలా స్టాక్స్ మంచి రిటర్న్స్ అందిస్తుంటాయి. ఇంకా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. వీటిల్లో చాలా వరకు మంచి ప్రీమియంతో స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అవుతుంటాయి. స్టాక్ మార్కెట్ లాభనష్టాలతో పెద్దగా సంబంధం లేకుండానే ఐపీఓలు లిస్ట్ అవుతుంటాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ సమయంలో టాటా టెక్నాలజీస్, ఐఆర్‌ఈడీఏ, మోతీసన్స్ జువెల్లర్స్, ఆజాద్ ఇంజినీరింగ్, ఐనాక్స్ ఇండియా వంటి పలు ఐపీఓలు దుమ్మురేపాయి. 100 శాతం నుంచి 250 శాతం వరకు తొలిరోజే పెరగడం విశేషం.

ఇప్పుడు ఇదే బాటలో చాలా రోజులకు మరో ఐపీఓ అదిరిపోయే రిటర్న్స్ లిస్టింగ్‌లోనే నమోదు చేసింది. ఇష్యూ ధర రూ. 106 కాగా.. ఏకంగా 173.58 శాతం ప్రీమియంతో రూ. 290 వద్ద లిస్టయింది. ఇదే టీఏసీ ఇన్ఫోసెక్ స్టాక్. అక్కడితో ఆగలేదు తర్వాత మరో 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. దీంతో చివరకు 187 శాతం లాభంతో రూ. 304.50 వద్ద స్థిరపడింది. దిగ్గజ పెట్టుబడిదారుడైన విజయ్ ఖేడియా ఇన్వెస్ట్ చేసిన ఈ ఐపీఓ మార్చి 27 (బుధవారం) సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది. ఏప్రిల్ 2న (మంగళవారం) ముగిసింది. ముఖ విలువ రూ. 10 గా నిర్ణయించగా.. ఇష్యూ ధర మొదటగా రూ. 100-106 మధ్య నిర్ణయించింది. తర్వాత రూ. 106 ను ఫైనల్ చేసింది. సబ్‌స్క్రిప్షన్ చివరి రోజున ఏకంగా 422.03 రెట్ల స్పందన లభించింది. ఇక ఇది ఎక్స్ఛేంజీలో లిస్టవగా.. ఒక్కో లాట్ కింద కనీసం 1200 షేర్లు ఓపెన్ చేయాల్సి ఉంటుంది. అంటే దీనికి పెట్టుబడి రూ. 1.27,200 గా ఉంది. ఇక లిస్టింగ్ రిటర్న్స్ చూస్తే 187 శాతానికిపైగా లాభం అంటే ఏకంగా రూ. 2,38 లక్షల మేర లాభం వచ్చింది. మొత్తం పెట్టుబడిని రూ. 3.65 లక్షలు చేసింది. టీఏసీ ఇన్ఫోసెక్ కంపెనీ విషయానికి వస్తే ఇది 2016 లో ప్రారంభమైంది. సైబర్ సెక్యూరిటీ క్వాంటిఫికేషన్, పెనెట్రేషన్ టెస్టింగ్, వెల్నరబులిటీ మేనేజ్‌మెంట్, అసెస్‌మెంట్‌కు సంబంధించి రిస్క్ బేస్డ్ సొల్యూషన్స్ అందిస్తుంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బంధన్ బ్యాంక్, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ-గవర్నెన్స్ వంటి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు, రెగ్యులేటర్లు దీనికి క్లయింట్లుగా ఉన్నాయి.

**స్టాక్ మార్కెట్ లాభనష్టాలతో పెద్దగా సంబంధం లేకుండానే ఐపీఓలు లిస్ట్ అవుతుంటాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ సమయంలో టాటా టెక్నాలజీస్, ఐఆర్‌ఈడీఏ, మోతీసన్స్ జువెల్లర్స్, ఆజాద్ ఇంజినీరింగ్, ఐనాక్స్ ఇండియా వంటి పలు ఐపీఓలు దుమ్మురేపాయి.**

**ముఖ విలువ రూ. 10 గా నిర్ణయించగా.. ఇష్యూ ధర మొదటగా రూ. 100-106 మధ్య నిర్ణయించింది. తర్వాత రూ. 106 ను ఫైనల్ చేసింది.**

# బంగారం ధర ఎప్పుడు తగ్గుతుంది? నిపుణులు ఏమంటున్నారు?

బంగారం ధరలు రోజు రోజు భారీగా పెరుగుతున్నాయి. రెండు రోజుల్లో తులం బంగారం రూ. 1300 పైన పెరిగింది. ప్రస్తుతం గ్రాము గోల్డ్ రేటు 7 వేల పైనే ఉంది. మరి ఈ సమయంలో బంగారం కొనుగోలు చేయడం మంచిదేనా? బంగారాన్ని నగల రూపంలో కొంటే బెటరా లేదా బాండ్స్ రూపంలో కొనడం మంచిదా? బంగారం ధరలు పెరిగేందుకు కారణాలేంటి, ఈ పసిడి ధరలు ఎప్పుడు తగ్గుతాయి? ధరలు తగ్గే వరకు వేచి చూడడం మంచిదేనా? బులియన్ మార్కెట్ నిపుణులు ఏమంటున్నారు అనేది ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. ఇటీవలి కాలంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధర పెరగుదలతో పోలిస్తే.. తగ్గడం చాలా స్వల్పంగా ఉంది. ఆర్థిక అనిశ్చితి, స్టాక్ మార్కెట్లలో ఒడుదొడుకుల వంటి కారణాలతో పెట్టుబడిదారులు బంగారాన్ని భద్రమైన సాధనంగా భావిస్తున్నారు. గోల్డ్ రేట్ల పెరుగుదల వెనుక అంతర్జాతీయ పరిణామాలుఉంటాయి. ప్రపంచ ప్రధాన మార్కెట్లలో లండన్ బులియన్ మార్కెట్ ఒకటి. ధరలను నిర్ణయించేది ఈ మార్కెట్టే. పెద్ద పెద్ద మైనింగ్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు ఈ సంస్థలో ఉన్నారు. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర 2,256 డాలర్ల స్థాయిలో ట్రేడింగ్ అవుతోంది. 2023 నాటి గరిష్ఠ ధరతో పోలిస్తే 8 శాతం ఎక్కువ. భారత కరెన్సీ విలువ సైతం పడిపోవడం గోల్డ్ ధరలు పెరిగేందుకు కారణమవుతోంది. ప్రతి ఏడాది భారత్ కు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతుంటుంది.

అమెరికాలో ఆర్థిక సంక్షోభం ధరల పెరుగుదలకు మరో కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

గత 20 ఏళ్ల కాలాన్ని గమనించినట్లయితే బంగారం ధరలు క్రమం తప్పకుండా పెరుగుతున్నాయి. దీనికి కారణం దాని డిమాండ్ పెరగడమే. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, ఎన్నికల వాతావరణం, డొనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయన్న ఊహాగానాలు, రాజకీయ పరమైన మార్పులు సైతం బంగారం పెరిగేందుకు కారణమవుతున్నాయి. బంగారం ధర ఎప్పుడు తగ్గొచ్చు? బంగారం ధరల పెరుగుదల 2025 వరకు కొనసాగే అవకాశం ఉందని జేపీ మోర్గాన్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు అంచనా వేస్తున్నాయి. అంటే ఈ ఏడాదంతా ధరలు పెరిగే అవకాశాలే ఉన్నాయని అర్థమవుతోంది. వచ్చే ఏడాదిలో కాస్త ఊరట లభించవచ్చు. బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్న క్రమంలో పసిడిపై పెట్టుబడి పెడితే మంచి రాబడి వచ్చే అవకాశం ఉంటుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అయితే, నగలు లేదా బంగారు నాణాలు కొనుగోలు చేస్తే మొత్తం ధరలో తరుగు కమిషన్ కింద 20 శాతం పోతుంది. అంటే మీరు రూ.100 పెట్టి బంగారం కొంటే దాని అసలు విలువ రూ.80 మాత్రమే. అదే గోల్డ్ బాండ్ కొనుగోలు చేస్తే నెల నెలా వడ్డీ వస్తుంది. బాండ్స్ పోతాయనే భయం ఉండదు. డిజిటల్ గోల్డ్ ద్వారా 4 కిలోల వరకు కొనుగోలు చేయవచ్చు. వాటిపై పన్ను మినహాయింపులు సైతం లభిస్తాయి.

# అదరగొట్టిన హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు.. వరుసగా 7వ రోజు లాభాలే..




హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు తమ ఇన్వెస్టర్లపై కాసులు కురిపిస్తున్నాయి. వరుసగా ఏడవ సెషన్‌లో లాభాపడ్డాయి. గత వారం రోజుల్లో 6 శాతానికిపైగా పెరిగాయి. నష్టాల నుంచి ఇక తేరుకున్నట్లేనా? ఇప్పుడు షేర్లు పెరిగేందుకు గల కారణాలేంటి? ఓసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు అదరగొడుతున్నాయి. వరుసగా ఏడవ సెషన్‌లో లాభాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏప్రిల్ 5వ తేదీన ఈ బ్యాంక్ స్టాక్ 1.5 శాతం మేర లాభంతో ట్రేడింగ్ అవుతోంది. ఈ వార్త రాసే సమయానికి దేశీయ అతిపెద్ద బ్యాంక్ షేర్లు 1.55 శాతం లాభంతో రూ.1551.65 వద్ద కొనసాగుతున్నాయి. అంతకు ముందు రోజు సెషన్‌లో ఈ షేర్లు 3 శాతం మేర లాభపడిన సంగతి తెలిసిందే. అలాగే గత 5 ట్రేడింగ్ సెషన్లలో చూసుకుంటే ఈ బ్యాంక్ షేర్లు సుమారు 6 శాతం మేర లాభపడ్డాయి. అలాగే గత ఏడు వరుస సెషన్స్లో 8 శాతం మేర పెరిగాయి. మరోవైపు.. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో మూడో త్రైమాసిక ఫలితాల ప్రకటన అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయి. ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు మిగిల్చాయి. అయితే, మళ్లీ క్యూ4 ఫలితాలపై పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ అందుతున్న క్రమంలోషేర్లు రాణిస్తుడడం గమనార్హం. ఈ క్రమంలోనే షేర్లపై పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇచ్చాయి జెఫ్ఫరీస్ అండ్ మక్వారీ వంటి చాలా బ్రోకరేజీ సంస్థలు. దీంతో మదుపరులు ఈ షేర్లు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, వరుస సెషన్లలో లాభాల్లో కొనసాగుతున్న క్రమంలో ఇక ముందు ముందు అదే ట్రెండ్ కొనసాగుతందని చెప్పేందుకు లేదు. ఏప్రిల్ 20వ తేదీన క్యూ4 ఫలితాలు ప్రకటించనుంది. ఆ తర్వాత స్టాక్ ఇదే పాజిటివ్ ట్రెండ్‌లో కొనసాగకపోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి 1757.50 వద్ద ఉండగా.. 52 వారాల కనిష్ఠ స్తాయి 1363. 55 వద్ద ఉంది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11.77 లక్షల కోట్లుగా ఉంది. పీఈ రేషియో 17.35 శాతం, డివిడెండ్ యీల్డ్ 1.23 శాతంగా ఉన్నాయి.

# లక్ష పెడితే రూ.15 లక్షలు..

ప్రముఖ లాజిస్టిక్ కంపెనీ స్టాక్ అదరగొట్టింది. గత వారం రోజులుగా వరుసగా అప్పర్ సర్క్యూట్‌లో లాక్ అవుతోంది. ఇన్వెస్టర్లకు కాసులు కురిపిస్తోంది. అంతే కాదు గత మూడేళ్లలోనే 1500 శాతం పెరిగి లక్ష పెట్టుబడికి రూ.15 లక్షలు లాభాలు అందించింది. అదే టైగర్ లాజిస్టిక్స్ ఇండియా కంపెనీ స్టాక్. గడిచిన ఆరు సెషన్లలో ప్రముఖ లాజిస్టిక్స్ కంపెనీ అయిన టైగర్ లాజిస్టిక్స్ ఇండియా లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. వరుస సెషన్లలో అప్పర్ సర్క్యూట్ కొడుతోంది. అలాగే గత మూడేళ్లలో 1500 శాతం పెరిగి మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించింది. లక్ష రూపాయలకు రూ. 15 లక్షలు లాభాలు ఇచ్చింది. భారతీయ స్టాక్ మార్కెట్ల లో ఇటీవలి కాలంలో మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించిన స్టాక్స్ లో ఒకటిగా నిలిచింది. మార్చి 28, 2024 నుంచి వరుస సెషన్లలో ఈ స్టాక్ అప్పర్ సర్క్యూట్ కొడుతూ వస్తోంది. ఏప్రిల్ 5 వ తేదీ శుక్రవారం నాటి ట్రేడింగ్ చూసుకుంటే మార్కెట్లు ప్రారంభమైన కొద్ది సేపటికే బీఎస్‌ఈలో ఇంట్రాడే హై వాల్యూ రూ. 58.69 స్థాయిని తాకింది.


కొద్ది సేపటికే 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ లో లాక్ అయింది. సుమారు రూ. 5.65 కోట్ల సర్వీస్ ట్యాక్స్ సంబంధించి కంపెనీకి అనుకూలంగా నిర్ణయం వెలువడినట్లు తెలిసిన క్రమంలో ఈ షేర్లు రాణిస్తున్నాయి. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్ లో సర్వీస్ ట్యాక్స్ గురించి వెల్లడించింది కంపెనీ. 2023, జులై 14, 2022 ఫిబ్రవరి 10 న సర్వీస్ ట్యాక్స్ డిమాండ్ నోటీసులు వచ్చాయని, ఇప్పుడు వాటికిసంబంధించిన నోటీసులపై అనుకూల నిర్ణయం వెలువడినట్లు తెలిపింది. రూ. 5.65 కోట్లలో రూ. 2.64 కోట్ల ట్యాక్స్ ఇప్పటికే చెల్లించినట్లు ట్యాక్స్ విభాగం తేల్చిందని పేర్కొంది. ఈ వార్త రాసే సమయానికి టైగర్ లాజిస్టిక్స్ ఇండియా లిమిటెడ్ షేరు 5 శాతం లాభంతో రూ. 58.69 వద్ద ట్రేడింగ్ అవుతోంది. గత 5 రోజుల్లోనే 21 శాతానికిపైగా పెరిగింది. ఈ కంపెనీ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 87 వద్ద ఉండగా.. 52 వారాల కనిష్ఠ స్థాయి రూ. 33.75 వద్ద ఉంది. అలాగే కంపెనీ మార్కెట్ విలువ రూ.620 కోట్లుగా ఉంది. పీఈ రేషియో 51. 76 వద్ద ఉంది. ఈ స్టాక్ గత ఏడాది కాలంలో 56 శాతం లాభపడింది. అయితే, మూడేళ్లలో 1500 శాతం మేర పెరిగింది. అంటే మూడేళ్ల క్రితం లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు ఆ షేర్ విలువ రూ. 16 లక్షలకుపైగా ఉంటుంది. మూడేళ్లలోనే లక్షకు రూ. 15 లక్షలు లాభాలు వచ్చినట్లయింది.

# భారతీయులకు శుభవార్త చెప్పిన జపాన్..



విదేశీ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించి, ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా జపాన్.. తన వీసా విధానంలో మార్పులు చేసింది. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఈ-వీసాను ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా చాలా ఈజీగా వీసాలను పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్ కింద భారతీయులు సహా పలు దేశాల పౌరులకు వీసా అందజేస్తోంది. ఈ కార్యక్రమం 90 రోజుల వరకు పర్యాటక ప్రయోజనాల కోసం జపాన్‌కు ప్రయాణించాలనుకునే వారికి ఒకే ప్రవేశ స్వల్పకాలిక వీసాను అందిస్తుంది.
అమెజాన్ సమ్మర్ స్పెషల్ ఎ స్ప్లిట్ ఇన్వర్టర్ ఏసీల ప్రారంభ ధర రూ. 25,990 మాత్రమే! ఎక్స్ఛేంజి డిస్కౌంట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. భారతీయుల సహా వివిధ దేశాల పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా జపాన్ 'ఈ-వీసా'ను ప్రారంభించింది. పాస్‌పోర్టులలో భౌతిక స్టిక్కర్ల అవసరం లేకుండా ఈ కొత్త విధానాన్ని జపాన్ తీసుకొచ్చింది. ఏప్రిల్ 1, 2024 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ఈ కొత్త విధానం ద్వారా భారతీయ పర్యాటకులు ఆన్‌లైన్‌లోనే వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీఎఫ్ఎస్ గ్లోబల్ ద్వారా నిర్వహిస్తున్న జపాన్ వీసా అప్లికేషన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. పర్యాటకుల సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఈ విధానంలో వీసా పొందినవారు జపాన్‌లో గరిష్ఠంగా 90 రోజులు ఉండటానికి అనుమతిస్తుంది. అయితే జపాన్‌లో ఎంట్రీకి మాత్రం ఒకే ఒక్కసారి అనుమతి ఉంటుంది. భారతీయులతో పాటు ఇండియాలో నివసిస్తున్న విదేశీయులు కూడా ఈ-వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆస్ట్రేలియా, బ్రెజిల్, కాంబోడియా, కెనడా, సౌదీ అరేబియా, సింగ్‌పూర్, దక్షిణాఫ్రికా, తైవాన్, యూఏఈ, యూకే, అమెరికాకు చెందిన పర్యాటకులకు కూడా ఎలక్ట్రానిక్ వీసాకు అర్హులే. ఈ దేశాలు లేదా ప్రాంతాల నివాసితులు, స్వల్పకాలిక వీసాల నుంచి మినహాయింపు పొందినవారు జపాన్ ఈ-వీసా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు విధానం... జపాన్ వీసా అధికారిక వెబ్‌సైట్ దరఖాస్తు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను పొందుపరచాలి. ఫొటోలతో సహా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతచేయాలి. దరఖాస్తును సమర్పించడానికి తేదీని ముందుగా బుక్ చేసుకుంటే ఫీజు వివరాలు సహా అపాయింట్‌మెంట్ లెటర్‌తో కూడిన ఈ-మెయిల్ వస్తుంది. దరఖాస్తును అందజేసి.. నిర్ణయం కోసం వేచిచూడాల్సి ఉంటుంది. వీసా అప్లికేషన్ స్టేటస్‌ని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. విజయవంతంగా ఎంపికైన దరఖాస్తుదారులకు ఎలక్ట్రానిక్ వీసా మంజూరు అవుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, భౌతిక వీసా స్టిక్కర్‌లను జారీ చేయడం జరగదు. ప్రయాణ సమయంలో ఎయిర్‌పోర్టుల వద్ద చెక్-ఇన్ సమయంలో తమ డివైజ్‌లలోని వీసా చూపించాల్సి ఉంటుంది. ఈ-వీసాపై ఉన్న డిస్‌ప్లే ఆప్షన్ మీద క్లిక్ చేస్తే సరిపోతుంది.

# ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం..



ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కంపెనీలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఆ మంటలు క్రమంగా ఇతర ట్రాన్స్‌ఫార్మర్లకు వ్యాపించాయి. దీంతో భారీ ప్రమాదం జరిగింది. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. రాజధాని రాయ్‌పూర్‌లోని కోటా ప్రాంతంలో ఉన్న ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫారం పేలడంతో ఒక్కసారిగా భారీగా శబ్దంతోపాటు మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ మంటలు కాస్తా.. పక్కనే ఉన్న మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు అంటుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇక సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి.. ఫైర్ సిబ్బంది.. ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు వ్యాపించడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ కూడా అలుముకుంది. వీలైనంత త్వరగా మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇక ట్రాన్స్‌ఫార్మర్ల పేలిన ఘటన జరిగిన సమయంలో కంపెనీలో కార్మికులు పని చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అందులో ఎందరు కార్మికులు ఉన్నారనేది అధికారులు ఆరా తీస్తున్నారు. వారి పరిస్థితి ఎలా ఉంది.. ఎవరైనా చనిపోయారా.. ఎవరికైనా గాయాలు అయ్యాయా అనే విషయాల గురించి ఇంకా ఎలాంటి సమాచారం అందించలేదు. ఇక ఈ ఘటనలో ఎంత ఆస్తి నష్టం సంభవించిందన్న వివరాలు తెలియాల్సి ఉంది.

# బర్త్ సర్టిఫికెట్‌లో తల్లిదండ్రుల మతం విడిగా నమోదు

గతేడాది పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జనన మరణ నమోదు చట్టానికి కేంద్ర ప్రభుత్వ సవరణలు చేసి.. బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారింది. ఈ చట్టంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం.. అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. అయితే, ఇందులోని నిబంధనలకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాస్తవానికి చట్టం అమలుకు రాష్ట్రాల సమ్మతి తప్పనిసరి. ఇకపై జనన ధ్రువీకరణ పత్రాల్లో తల్లిదండ్రులు తమ మతం గురించి వ్యక్తిగతంగా నమోదుచేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 'కుటుంబ మతం' స్థానంలో తల్లి, తండ్రి విడిగా తమ మతం గురించి డిక్లరేషన్ ఇవ్వాలి. ఈ కొత్త నిబంధన కేంద్ర హోంశాఖ నమూనా నిబంధనలకు అనుగుణంగా ఉంది. అయితే, ఇది అమల్లోకి వచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసి, వాటి ఆమోదం తప్పనిసరి. దత్తత తీసుకునే తల్లిదండ్రుల కూడా మతాన్ని వ్యక్తిగతంగా నమోదు చేయాలి. జనన, మరణాల నమోదుకు జాతీయ స్థాయి డేటాబేస్ ఏర్పాటు చేయనున్నారు. ఆధార్ నంబర్లు, ఆస్తి రిజిస్ట్రేషన్లు, రేషన్ కార్డులు, ఎలక్టోరల్ రోల్స్, పాస్‌పోర్టులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్‌తో సహా అనేక ఇతర డేటాబేస్‌లను రిఫ్రెష్ చేయడానికి దీనిని సమర్థంగా ఉపయోగించనున్నారు. గత, వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో జనన మరణ నమోదు (సవరణ) చట్టం బిల్లు 2023కు ఉభయసభలు ఆమోదం తెలిపాయి. ఆగస్టు 1న లోక్‌సభలోనూ, 7న రాజ్యసభలోనూ ఆమోదించారు. అక్టోబర్ 2023 నుంచి విద్యా సంస్థలలో ప్రవేశం, డ్రైవింగ్ లైసెన్స్, ఓటు హక్కు, ఆధార్ నంబర్‌ను పొందడం, వివాహాలను నమోదు, ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందడం వంటి వివిధ ముఖ్యమైన సేవలకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేశారు. 'జననాలు, మరణాల డేటాబేస్ రూపొందించడంలో ఇది సహాయపడుతుంది. ప్రజా సేవలు, సామాజిక ప్రయోజనాలు, డిజిటల్ రిజిస్ట్రేషన్‌లో సమర్థవంతమైన, పారదర్శకతకు సహకరిస్తుంది'అని హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 'జనన మరణాల నమోదు (సవరణ) చట్టం, 2023 (20 ఆఫ్ 2023)లోని సెక్షన్ 1లోని సబ్-సెక్షన్ (2) ద్వారా దఖలుపడిన అధికారాలను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం 2023 అక్టోబర్ 1 నుంచి చట్టంలోని నిబంధనలు అమల్లోకి వస్తాయని' అని నోటిఫికేషన్ పేర్కొంది.

# ప్రపంచ క్యాన్సర్ రాజధానిగా భారత్..



ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న కేన్సర్ మరణాల్లో దాదాపు సగం ధూమపానం, మద్యం సేవించడం, అధికబరువు వంటి కారణాలే కారణమని పలు అధ్యయనాల్లో వెల్లడయ్యింది. ఇక, దేశంలో కేన్సర్ భారినపడుతోన్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగతూ ఉండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న వయసు పిల్లలు సైతం దీని బారిపడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఏడాదికి 40 వేల నుంచి 50 వేల మంది చిన్నారులు మహమ్మారి బారిన పడేవారు.
కేన్సర్ వ్యాధిపై ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఏటా లక్షల మందిని ఈ మహమ్మారి బలితీసుకుంటోంది. ఇక, భారత్ కేన్సర్‌కు రాజధానిగా మారిపోయిందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. కేన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్ (బీపీ), హృద్రోగం, మానసిక సమస్యల వంటి అసాంక్రమిక వ్యాధులు తీవ్రస్థాయిలో పెరిగిపోతున్నట్టు ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా కేన్సర్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోందని, ప్రపంచ కేన్సర్ రాజధానిగా భారత్ తయారైందా? అన్న స్థాయిలో పరిస్థితి ఉందని పేర్కొంది. 'హెల్త్ ఆఫ్ ది నేషన్' పేరుతో అపోలో హాస్పిటల్స్ గురువారం విడుదల చేసిన నాలుగో వార్షిక నివేదికలో పలు సంచలన విషయాలు ఉన్నాయి. చిన్నపిల్లలు పలు అసాంక్రమిక వ్యాధుల బారినపడటం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని, దీనిని నివారించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని నివేదిక సూచించింది. కేన్సర్ విషయంలో కూడా ఇది కనిపిస్తోందని, ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో ఈ వ్యాధి బారినపడుతున్న వారి సగటు వయసు చాలా తక్కువగా ఉంటోందని వివరించింది. దేశంలో రొమ్ము, గర్భాశయం, ఊపిరితిత్తులు, నోటి కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతునప్పటికీ, నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం చాలా తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. అలాగే, స్థూలకాయం (ఒబిసిటీ) కూడా భారతీయ యువతలో పెరిగిపోతోందని, ఇది పలు అసాంక్రమిక వ్యాధులకు కారణమవుతోందని తెలిపింది.
అంతేకాదు, మధుమేహం, హైపర్ టెన్షన్ (బీపీ)ల ముప్పును పలువురు భారతీయులు ఎదుర్కొంటున్నారని వెల్లడయ్యింది. యువతలో మానసిక సమస్యలు ముఖ్యంగా కుంగుబాటు (డిప్రెషన్) అధికంగా కనిపిస్తోందని తేలింది. ఈ నివేదికపై అపోలో హాస్పిటల్స్ వైస్-ఛైర్మన్ డాక్టర్ ప్రీతా రెడ్డి మాట్లాడుతూ.. అసాంక్రమిక వ్యాధులను ఎదుర్కోవటానికి తక్షణం సమష్టి కార్యాచరణ అవసరమని అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచటంతోపాటు వ్యక్తిగత స్థాయిలో చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఆవశ్యకత ఉందని చెప్పారు.
వైద్య చికిత్సలకు సంబంధించి మరిన్ని ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని, వాటిని ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలని అపోలో సంస్థల ఛైర్మన్, సీఈఓ డాక్టర్ మధు శశిధర్ సూచించారు. ఈ మేరకు అపోలో 'ప్రో హెల్త్ స్కోర్' పేరుతో దేశంలోనే తొలి డిజిటల్ హెల్త్ కౌంటింగ్ టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా తమ ఆరోగ్యం పై స్వీయ అంచనాకు వచ్చి, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టటానికి అవకాశం లభిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఓ ప్రకటనలో తెలిపింది. అసాంక్రమిక వ్యాధులు దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.లక్షల కోట్ల మేర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో.. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ టూల్ ఎంతో ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.



# అల్లు అర్జున్‌కి జోడీగా..?

'పుష్ప: ది రైజ్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరో అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన 'పుష్ప: ది రూల్' సినిమా చేస్తున్నారు. ఆ చిత్రం పూర్తయిన తర్వాత తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అందులో భాగంగానే హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులను ఫైనల్ చేసే పనిలో పడ్డారట అట్లీ.కాగా ఈ మూవీలో అల్లు అర్జున్‌కి జోడీగా నటించే హీరోయిన్ల జాబితాలో సమంత, త్రిష పేర్లు వినిపిస్తున్నాయి. తొలుత త్రిష పేరు తెరపైకి వచ్చింది. అల్లు అర్జున్‌కి ఆమె జోడీగా నటించనున్నారనే వార్తలు కోలీవుడ్‌లో హల్‌చల్ చేశాయి. అయితే తాజాగా సమంత పేరు వినిపిస్తోంది. అట్లీ దర్శకత్వం వహించిన 'తేరి' సినిమాలో విజయ్‌కి జోడీగా నటించారు సమంత. అలాగే 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రంలో అల్లు అర్జున్‌తో జతకట్టారీ బ్యూటీ.అలాగే 'పుష్ప: ది రైజ్' మూవీలో 'ఊ అంటావా...' అంటూ ప్రత్యేక పాట చేశారు. తాజాగా వీరి జోడీ రిపీట్ కానుందనే వార్తలు నెట్టింట వైరల్‌గా మారాయి. మరి అల్లు అర్జున్ సరసన నటించేది సమంతా? త్రిషా? లేకుంటే ఇద్దరూ నటిస్తారా? ఈ ఇద్దరూ కాకుండా వేరే కథానాయిక నటిస్తారా? అనే విషయం తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి. ఈ అక్టోబర్‌లో అల్లు అర్జున్%--%అట్లీ మూవీ సెట్స్ మీదకు వెళ్లనుందని టాక్.



# మృణాల్.. మరో హిట్టొస్తే రెమ్యునరేషన్ ఎంత పెరుగుతుందో?

టాలీవుడ్ సీతగా మంచి గుర్తింపు అందుకున్న మృణాల్ ఠాకూర్ మరో రెండు రోజుల్లో ఫ్యామిలీ స్టార్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రౌడీ హీరో విజయ్ దేవరకొండకు జోడీగా కనిపించనుంది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్.. ఈ చిత్రంపై భారీ అంచనాలు క్రియేట్ చేశాయి. సినిమా కచ్చితంగా హిట్ అవుద్దని నిర్మాత దిల్ రాజుతో పాటు మూవీ టీమ్ అంతా నమ్మకంతో ఉంది.ఇక సీతారామం సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్.. ఫస్ట్ మూవీతోనే తనదైన గుర్తింపు సంపాదించుకుంది. సీతగా తన అందంతో ప్రత్యేక ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. తన అభినయంతో అందరి మనసులు దోచుకుంది. ఆ సినిమా తర్వాత వరుసగా ఆఫర్లు దక్కించుకుంది. కానీ ఆచితూచి అడుగులేస్తోంది మృణాల్. గతేడాది హాయ్ నాన్న సినిమాలో నాని సరసన నటించి ఆకట్టుకుంది.ఈ సినిమాలో కూడా తన యాక్టింగ్ తో మంచి ప్రశంసలు అందుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో ఆమె చేసిన తొలి రెండు మూవీలు సీతారామం, హాయ్ నాన్న థియేటర్లలోనే కాకుండా ఓటీటీలో కూడా హిట్లు అయ్యాయి. సినిమాలో హీరోయిన్ రోల్ కు మంచి స్కోప్ ఉన్న ప్రాజెక్టులకే గ్రీన్ సిగ్నల్ ఇస్తున్న మృణాల్.. ఇప్పుడు ఫ్యామిలీ స్టార్ తో సందడి చేయనుంది. టాలీవుడ్ లో హ్యాట్రిక్ హిట్ కొట్టాలని గట్టిగా ఫిక్స్ అయింది.

సీతారామం వరకు అమ్మడి రెమ్యునరేషన్ కోటి కంటే తక్కువే ఉండేది. ఆ తరువాత హాయ్ నాన్న హిట్టుతో లెక్క కోటి దాటింది. ఇక ఇప్పుడు ఫ్యామిలీ స్టార్ హిట్టయితే ఆమె రెమ్యునరేషన్ రేటు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. తెలుగులో వరుసగా హిట్లు కొడుతుండడంతో ఆమెను లక్కీ గర్ల్ అని పిలవడం ప్రారంభించారు సినీ ప్రియులు.అయితే తనకు ఆ లేబుల్ ఇష్టం లేదని, యాక్టింగ్ అనేది తనకొక జాబ్ లాంటిదని చెప్పింది. తనకు నటన ప్యాషన్ అని వెల్లడించింది. తనకు బాగా కనెక్ట్ అయ్యే రోల్స్ ను మాత్రమే ఎంచుకుంటానని తెలిపింది. సీతారామంలో సీతగా, హాయ్ నాన్నలో యష్ణగా కనిపించిన తాను.. ఇప్పుడు ఫ్యామిలీ స్టార్ లో ఇందుగా సందడి చేయనున్నట్లు చెప్పింది.ఇక ఫ్యామిలీ స్టార్ విజయం మృణాల్ తో పాటు విజయ్ దేవరకొండకు కూడా కీలకమే. లైగర్ తో భారీ డిజాస్టర్ అందుకున్న విజయ్..ఆ తరువాత ఖుషితో పరవాలేదు అనిపించాడు. ఇక ఈ సినిమాతో గట్టి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. టాలీవుడ్ లో వరుస విజయాలతో దూసుకుపోతున్న మృణాల్ కెరీర్ గ్రాఫ్ ను ఈ మూవీ పెంచే ఛాన్స్ ఉంది అలాగే స్టార్ హీరోయిన్ ట్యాగ్ తెచ్చి పెడుతుంది.

## నేచురల్ లుక్‌లో కృతి.. గ్లామర్‌తో వాయించేసిన నేహా.. బికినీలో దిశా పటానీ



టాలీవుడ్ టూ బాలీవుడ్ ముద్దుగుమ్మలు ఈరోజు షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ అప్‌డేట్స్ చూద్దాం.యంగ్ హీరోయిన్ కృతి శెట్టి నేచురల్ లుక్‌లో కనిపించింది.డీజే టిల్లు భామ నేహా శెట్టి గ్లామర్ ట్రీట్ అదిరిపోయింది.బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ మరోసారి బికినీలో రెచ్చిపోయింది.తమిళ అందం ఐశ్వర్య మీనన్ ఓ క్యూట్ వీడియోను షేర్ చేసింది.రియా చక్రవర్తి బీచ్‌లో బికినీలో అందాలు ఆరబోస్తూ ఓ వీడియో వదిలింది.భీమా బ్యూటీ మాళవిక శర్మ కొత్త ఫొటోలు వైరల్ అవుతున్నాయి.హీరోయిన్ రాశి ఖన్నా చీరలో వయ్యారాలు ఒలకబోసింది.స్టార్ హీరోయిన్ సమంత బ్లాక్ ఔట్‌ఫిట్‌లో కిర్రాక్ లుక్‌లో కనిపించింది.వీరితో పాటు మిగిలిన బ్యూటీలు షేర్ చేసిన విశేషాలపైనా ఓ లుక్కేద్దాం.

# స్కిన్ షో తప్పే కాదు.. తమన్నా షాకింగ్ కామెంట్స్



మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20 ఏళ్లు అవ్వబోతుంది. కెరీర్ ఆరంభంలో కాస్త ఒడిదొడుకులు ఎదుర్కొన్న మిల్కీ బ్యూటీ గత పుష్కర కాలంగా స్టార్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తూనే ఉంది. ఈ మధ్య కాలంలో తమన్నా యంగ్ స్టార్ హీరోలతో సినిమాలు చేసే అవకాశాలు దక్కించుకోలేక పోతుంది.సీనియర్ హీరోలకు జోడీగా, వెబ్ సిరీస్ ల్లో మరియు మ్యూజిక్ ఆల్బమ్స్ లో నటిస్తూ తన అందాల ఆరబోత కంటిన్యూ చేస్తూనే ఉంది. ఇప్పటికి కూడా భారీ పారితోషికం డిమాండ్ చేస్తున్న తమన్నా గత ఏడాది చేసిన జైలర్ కావాలయ్యా ఐటెం సాంగ్ కి మంచి స్పందన వచ్చింది.వయసు పెరుగుతున్న కొద్దీ మిల్కీ బ్యూటీ తమన్నా అందం ఇంకా పెరుగుతుందా అన్నట్లుగా ఈ పాటలో ఆమెను చూస్తే అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేశారు. సోషల్ మీడియాలో కొందరు ఆ పాటలో మిల్కీ బ్యూటీ డాన్స్ మూవ్స్ మరియు స్కిన్ షో పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ మీమ్స్ క్రియేట్ చేశారు.వాటిపై తమన్నా తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. గ్లామర్ గా కనిపించడం, ఐటెం సాంగ్స్ చేయడం అనేది ప్రేక్షకులకు వినోదాన్ని పంచడం కోసం మాత్రమే అనే విషయం గుర్తించాలి. కమర్షియల్ సినిమాల్లో ముఖ్యంగా పాటల్లో గ్లామర్ గా కనిపించడం పెద్ద తప్పేం కాదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. ఇలాంటి పాటల విషయంలో స్కిన్ షో విషయంలో ప్రేక్షకుల మైండ్ సెట్ మారాలి అంటూ తమన్నా అభిప్రాయం వ్యక్తం చేసింది.

ఇంకా కూడా ఒక మూస పద్దతిలో పాత తరహా వారిలా ఆలోచించడం కరెక్ట్ కాదని కొందరు ఆమెకు మద్దతుగా నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు.